సాక్షి
నంద్యాల
గురువారం ; 20 ; మార్చి ; 2025



నయన మనోహరం

నవ మంత్రాలయం శిల్పి, రాఘవేంద్రస్వామి మఠం పూర్వపు పీఠాధిపతి సుయతీంద్రతీర్థుల మధ్యారాధన వేడుకలు బుధవారం నయన మనోహరంగా సాగాయి. 8లో▸



అలరించిన భజన

శ్రీశైలంటెంపుల్: ధర్మపథం కార్యక్రమంలో భాగంగా బుధవారం నిత్యకళావేదికపై విజయవాడకు చెందిన శ్రీనివాస భజన బృందం ప్రదర్శించిన భజన భక్తులను అలరించింది.



పెద్దాయనా..మన్నించు!

దివంగత మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి ఉత్సవాలను అధికారులు నిర్వహించారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు నిధులు ఇవ్వలేదు. 8లో▸

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:34	ఉ॥ 5:00
ఆదోని	సా॥ 6:33	ఉ॥ 4:59
నంద్యాల	సా॥ 6:31	ఉ॥ 5:00
ఆత్మకూరు	సా॥ 6:31	ఉ॥ 4:55
బనగానపల్లె	సా॥ 6:32	ఉ॥ 4:58

హదీస్ వెలుగు:

చూపు ఎంత మంచిదో అంతకు మించిన ప్రమాదకారి. మనిషి పాపాలకు చూపు మొదటి ఆయుధం. పాపాలు చేయకుండా ఉండేందుకు చూపును నియంత్రణలో ఉంచుకోండి.'

– పవిత్ర ఖురాన్

న్యూస్‌రీల్

ప్రశాంతంగా 'పది' పరీక్షలు

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహిస్తున్నట్లు డీఈఓ జనార్దన్‌రెడ్డి తెలిపారు. జిల్లాలో 130 పరీక్ష కేంద్రాల్లో బుధవారం హిందీ పరీక్ష నిర్వహించగా 24,785 మందికి గాను 24,418 మంది విద్యార్థులు (98.51శాతం) హాజరయ్యారని పేర్కొన్నారు. మొత్తం 367 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 16 పరీక్ష కేంద్రాలను ఏడు ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలు పరిశీలించాయన్నారు. ఎస్పీజీ స్కూల్ పక్కన ఉన్న ఎస్పీజీ జూనియర్ కళాశాలలోకి పరీక్ష కేంద్రాన్ని బుధవారం మార్పు చేసినట్లు డీఈఓ తెలిపారు. జిల్లాలో తొమ్మిది పరీక్ష కేంద్రాల్లో 509మంది విద్యార్థులకు గాను 454 మంది విద్యార్థులు (88.41శాతం) పదోతరగతి ఓపెన్ ఆంగ్లం పరీక్షకు హాజరయ్యారన్నారు. మొత్తం 59మంది విద్యార్థులు గైర్హాజరయ్యారన్నారు.

పన్నుల ఆదాయం రూ.10.43 కోట్లు

చాగలమర్రి: నంద్యాల జిల్లాలోని 489 గ్రామ పంచాయితీలకు పన్నుల రూపంలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి రూ.10.43 కోట్ల ఆదాయం సమకూరిందని జిల్లా పంచాయతీ అధికారి జమివుల్లా తెలిపారు. చాగలమర్రిలోని ఐదు సచివాలయాలు, పంచాయతీ కార్యాలయాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. 15వ ఆర్థిక ప్రణాళిక సంఘం ద్వారా జిల్లాలోని 489 పంచాయితీలకు రూ.28.00 కోట్లు వచ్చాయని, ఈ నిధులను వివిధ పనులకు వినియోగించాల్సి ఉందన్నారు. పంచాయతీరాజ్ శాఖలో పదోన్నతులు చేపట్టారని, పది రోజుల్లో ఆ శాఖలో ఉన్న ఖాళీ పోస్టులను భర్తీ చేస్తారని తెలిపారు.

జిల్లాలో ఐదు 'శక్తి' బృందాలు

బొమ్మలసత్రం: మహిళల రక్షణ కోసం జిల్లాలో ఐదు శక్తి బృందాలను ఏర్పాటు చేశామని, బృంద సభ్యులు నిత్యం పనిచేస్తారని ఎస్పీ అదిరాజ్‌సింగ్‌రాణా తెలిపారు. తన కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్న మహిళలు, బాలికల రక్షణ కోసమే శక్తి యాప్‌ను అందుబాటులోకి తెచ్చారని, మొబైల్ ఫోన్‌లలో ఈ యాప్ వినియోగించుకోవాలన్నారు. మహిళలు ఏదైనా ఆపదలో ఉంటే 112 నంబరుకు గానీ ఎస్‌వోఎస్ బటన్‌ను నొక్కితే వెంటనే పోలీసులు వారిని సమీపిస్తారన్నారు. ప్రస్తుతం పదో తరగతి పరీక్షలు జరుగుతున్న కేంద్రాల వద్ద ఇద్దరు కానిస్టేబుళ్లతో పాటు వార్డు మహిళా పోలీసులను నియమించామన్నారు.

దివ్యాంగ విద్యార్థినికి ప్రత్యేక డెస్క్




దివ్యాంగురాలైన విద్యార్థినికి కేటాయించిన డెస్క్ చూపుతున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్

పగిద్యాల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాస్తున్న పడమర ప్రాతకోటకు చెందిన దివ్యాంగురాలైన విద్యార్థిని రాజేశ్వరికి గ్రౌండ్ ఫ్లోర్‌లోనే ప్రత్యేక డెస్క్‌ను ఏర్పాటు చేశారు. ''అధికారులూ.. కనిపిస్తోందా'' అని మంగళవారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన వార్తకు అధికారులు ఈ మేరకు స్పందించారు. పదో తరగతి పరీక్షలు రాసే దివ్యాంగులకు విధిగా గ్రౌండ్‌ఫ్లోర్‌నే అధికారులు కేటాయించాల్సి ఉండగా.. దివ్యాంగురాలైన విద్యార్థిని రాజేశ్వరికి మొదటి ఫ్లోర్‌లో పరీక్ష గది కేటాయించారు. కుమార్తెను ఆ ఫ్లోర్‌కు చేర్చడానికి తల్లి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తల్లి కష్టంపై 'సాక్షి' దినపత్రికలో వార్త రావడంతో బుధవారం హిందీ పరీక్ష రాసేందుకు వెళ్లిన దివ్యాంగురాలైన విద్యార్థిని రాజేశ్వరికి గ్రౌండ్ ఫ్లోర్‌లోనే ప్రత్యేక డెస్క్‌ను ఏర్పాటు చేశారు.



అన్నదాతకు సాయం 0



జిల్లాలో వైఎస్సార్‌సీపీ హయాంలో రైతు భరోసా సాయం ఇలా..					
సంవత్సరం	2019-20	2020-21	2021-22	2022-23	2023-24
రైతులు	2,09,861	2,15,936	2,15,595	2,21,241	2,19,791
ప్రభుత్వ సాయం (రూ.కోట్లలో)	283.31	291.51	291.05	298.67	220.97

- ఖరీఫ్, రబీ సీజన్‌లు ముగిసినా దక్కని పెట్టుబడి సాయం
- నయా పైసా విదల్చని కూటమి ప్రభుత్వం
- రైతు భరోసా పేరును అన్నదాత సుఖీభవగా మార్పుతోనే సరిపెట్టిన వైనం
- 9 నెలలు గడిచినా పెట్టుబడి సాయం ఎప్పుడిస్తారో చెప్పలేని దుస్థితి

ఎన్నికల ప్రచారంలో రైతులకు ఏటా రూ. 20 వేలు పెట్టుబడి సాయం అందజేస్తామంటూ ఊరూరా ఊదరగొట్టారు. అధికారంలోకి వచ్చి సుమారు 9 నెలలు అవుతున్నా పైసా ఇవ్వలేదు. పంటల సాగుకోసం అవస్థలు పడుతున్నా కనీసం పట్టించుకునే నాథుడేలేరు. ఖరీఫ్ సీజన్ ముగిసింది.. రబీ సీజన్ ఈ నెల 15తో ముగిసింది. ఇప్పటికే అకాల వర్షాలు, వరదలు, తుఫానులతో తీవ్ర నష్టాలు చవిచూసిన అన్నదాతలు ప్రభుత్వం పెట్టుబడి సాయం కూడా అందక పోవడంతో దిక్కుతోచనిస్థితిలో ఉన్నారు.

ఆళ్లగడ్డ: కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో సూపర్‌సిక్స్‌లో 'ప్రతి రైతుకు ఏటా రూ. 20 వేల ఆర్థిక సాయం' ఒకటి. అన్ని హామీల తరహాతోనే ఈ హామీని తుంగలో తొక్కారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ఊసే పట్టనట్లు వ్యవహరించడంపై అన్నదాతల్లో ఆందోళన రేకెత్తిస్తోంది. చంద్రబాబు హయాంలోని కూటమి ప్రభుత్వం పాలనా పగ్గాలు చేపట్టి 9 నెలలు గడిచినా రైతులకు ఒక్క పైసా కూడా సాయంగా అందించిన పాపాన పోలేదు. అధికారం చేపట్టిన వెంటనే 'రైతు భరోసా' పథకాన్ని 'అన్నదాత సుఖీభవ' అంటూ పేరు మార్చడం మినహా నిధుల విడుదల ఊసే ఎత్తడం లేదు. గతంలో వ్యవసాయమే దండగ అన్న చంద్రబాబు సర్కారు.. మరోసారి అదే తీరున వ్యవహరిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. రైతులకు ఏ విధంగా సహాయం చేయాలనే ఆలోచనే చేయడం లేదనే చర్చ కొనసాగుతోంది. జిల్లాలో 28 మండలాల పరిధిలో 3,35,887 మంది రైతులు ఉండగా వ్యవసాయ భూమి 2.50 లక్షల హెక్టార్లు ఉంది. రైతులు పంటల సాగులో విత్తనాలు, కలుపు తీసేందుకు, మందులు, ఎరువులు వేసేందుకు నగదు అవసరం. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇంత వరకు సాయం అందక పోవడంతో పెట్టుబడి కోసం కొంత మంది రైతులు బంగారం తాకట్టు పెట్టుకోగా అనేక మంది అధిక వడ్డీలకు అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్‌లో చెప్పినట్టుగా సాయం విడుదలకు చర్యలు తీసుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

తంచన్‌గా కేంద్ర ప్రభుత్వ సాయం

పీఎం కిసాన్ పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం రైతులకు మూడు విడతల్లో రూ. 6 వేలు సాయం అందజేస్తామని ప్రకటించింది. ఆ మేరకు జూన్ నెలలో రూ. 2 వేలు, అక్టోబర్‌లో రూ. 2 వేల చొప్పున విడుదల చేసింది. తాజాగా మార్చి మొదటి వారంలో మూడో విడత కింద జిల్లాలో 1,45,407 మంది రైతులకు ఒక్కొక్కరికి రూ. 2 వేల చొప్పున రూ 28.040 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసింది. అయితే ఖరీఫ్, రబీ సీజన్లు ముగుస్తున్నా.. రూ. 20 వేలు చొప్పున సాయం అందిస్తామన్న చంద్రబాబు ప్రభుత్వం మాత్రం మీనమేషాలు లెక్కిస్తూనే ఉంది.

వైఎస్సార్‌సీపీ హయాంలో ఇలా..

గత ఐదేళ్లగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వ్యవసాయానికి అధిక ప్రాధాన్యతనిచ్చి 'వైఎస్సార్ రైతు భరోసా'' పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేసింది. రైతన్నలు ఎవరి వద్ద చేయి చాచి అప్పులు అడిగే పరిస్థితి లేకుండా ఖరీఫ్, రబీ సీజన్ల ప్రారంభంలోనే ఆర్థిక సహాయం వారి ఖాతాల్లో జమ చేసింది. జిల్లాలో సుమారు 2.34 లక్షల మంది అర్హులైన రైతులకు ప్రతి ఏటా సుమారు రూ. 316.25 కోట్లు చొప్పున ఐదేళ్ల ఏటా మూడు విడతలుగా అందించిన సాయంతో రైతులు సాగును పండుగలా చేసుకున్నారు. అన్నదాతలు పెట్టుబడి కోసం దళారులను ఆశ్రయించి అప్పుల ఊబిలో చిక్కుకోకూడదని రైతుభరోసా సాయం అందించి ఐదేళ్ల ఆదుకుంది. వైఎస్సార్ రైతు భరోసా – పీఎం కిసాన్ కింద ప్రభుత్వం ప్రతి ఏటా ముడు విడుతల్లో రూ. 13,500 సాయాన్ని అందించింది. రూ. 7500 మే నెలలో, రూ 4. వేలు అక్టోబర్‌లో, మిగిలిన రూ. 2 వేలు జనవరిలో జమ చేయడం జరిగింది. భూ యజమానులకు మాత్రమే పీఎం కిసాన్ కింద కేంద్రం మూడు విడుతల్లో రూ 6వేల చొప్పున జమ చేసేది. ఎలాంటి భూమి లేని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలకు చెందిన కౌలుదారులతో పాటు దేవదాయ, అటవీ, వక్ఫ తదితర ప్రభుత్వ భూములను సాగు చేస్తున్న , కౌలుదారులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే ఏటా రూ.13,500 చొప్పున అందజేస్తూ అండగా నిలిచింది. సన్నచిన్నకారు రైతులకు ఈ సాయం ఎంతో ఉపయోగపడేది.

“ పెట్టుబడి సాయం అందించి ఆదుకోవాలి



గతంలో నాకు ఏటా రూ. 13,500 చొప్పున మూడు విడతల్లో నా ఖాతాలో డబ్బులు జమ అయ్యేవి. ఈ ప్రభుత్వ హయాంలో ఇప్పటికి వానకారు, ఎండకారు ముగుస్తున్నా ప్రభుత్వం ఇస్తామన్న రూ. 20 వేలలో నయాపైసా వేయలేదు. తక్షణమే పెట్టుబడి సాయం అందించి ఆదుకోవాలి.

– దక్క పెద్ద చెన్నయ్య, క్రిష్టిపాడు

రైతులకు మళ్లీ కష్టాలు



రైతులకు మళ్లీ సాగు కష్టాలు దాపురించాయి. ఏడాది అవుతున్నా ఇంతవరకు రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ కింద ఇస్తానన్న రూ. 20 వేల పెట్టుబడి సాయంలో నయాపైసా ఇవ్వలేదు. కేంద్ర ప్రభుత్వం రెండు విడతల్లో రూ. 4 వేలు అందజేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికీ పెట్టుబడి సాయంపై స్పందించక పోవడం సిగ్గుచేటు.

– లింగారెడ్డి, ఓబులంపల్లె

27న 'స్థానిక' ఖాళీల భర్తీకి ఎన్నికలు



కర్నూలు(అర్బన్): జిల్లా పరిషత్, మండల పరిషత్తుల్లో ఖాళీగా ఉన్న కోఆప్షన్ సభ్యులు, ఎంపీపీ పదవుల భర్తీకి ఈ నెల 27న ఎన్నికలు నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు వెలుగోడుకు చెందిన సయ్యద్ సులేమాన్ గత ఏడాది మార్చి 28న, క్రిష్ణగిరి మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు షేక్ షాలీసాహెబ్ ఈ ఏడాది జనవరి 1న మృతి చెందారన్నారు. అదేవిధంగా వెల్దుర్తి, తుగ్గలి మండల పరిషత్ అధ్యక్షులు బి.శారద, ఆదెమ్మ వ్యక్తిగత కారణాలతో 2024 మార్చి 29న తమ పదవులకు రాజీనామా చేశారన్నారు. ఈ నేపథ్యంలో ఖాళీ ఏర్పడిన నాలుగు పోస్టులకు ఎన్నికలను నిర్వహించనున్నామన్నారు. ఇందుకు సంబంధించి ఈ నెల 23న నోటీసులు జారీ చేస్తామని, ఆ రోజు నుంచి కోఆప్షన్ సభ్యుల స్థానాలకు 27వ తేది ఉదయం 10 గంటల వరకు, ఎంపీపీ స్థానాలకు ఉదయం 11 గంటల వరకు నామినేషన్లు దాఖలు చేసుకోవచ్చన్నారు. నామినేషన్ల ప్రక్రియ పూర్తయిన అనంతరం యథావిధిగా నామినేషన్ల ఉపసంహరణ, బరిలో ఉన్న వారి జాబితాలను ప్రకటిస్తామన్నారు. అదే రోజున మధ్యాహ్నం 1 గంటకు జెడ్పీలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి కోఆప్షన్ సభ్యున్ని ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. అలాగే మండల పరిషత్ కార్యాలయాల్లో కూడా ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి ఎంపీపీ, కోఆప్షన్ సభ్యున్ని ఎన్నుకుంటారన్నారు.

ఖాళీగా మూడు జెడ్పీటీసీ స్థానాలు ....

జిల్లా పరిషత్‌లో కూడా మూడు జెడ్పీటీసీ స్థానాలు ఖాళీగా ఉన్నాయి. కల్లూరు జెడ్పీటీసీ వి.ప్రభాకర్‌రెడ్డి 2023 అక్టోబర్ 20న మృతి చెందారు. చిప్పగిరి జెడ్పీటీసీగా ఉన్న బి.విరుపాక్షి ఆలూరు ఎమ్మెల్యేగా ఎన్నికవడం వల్ల తన జెడ్పీటీసీ పదవికి 2024 జూన్ 14న రాజీనామా చేశారు. ప్యాపిలి జెడ్పీటీసీగా ఉన్న బోరెడ్డి శ్రీరాంరెడ్డి రోడ్డు ప్రమాదంలో గాయపడి ఈ నెల 10న మరణించారు. ఈ మూడు స్థానాలతో పాటు జిల్లాలో ఖాళీగా ఉన్న సర్పంచు, ఎంపీటీసీ, వార్డు సభ్యుల స్థానాలకు త్వరలో ఎన్నికలు నిర్వహించే అవకాశాలు ఉన్నాయి.

ఆరు గ్రామ పంచాయతీల్లో ఉప సర్పంచులకు..

జిల్లాలోని ఆరు గ్రామ పంచాయతీల్లో ఉప సర్పంచు స్థానాలకు ఈ నెల 27న ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి జి.భాస్కర్ తెలిపారు. దేవనకొండ మండలం వెలమకూరు, పత్తికొండ మండలం జూటూరు, ఓర్వకల్ మండలం గుట్టపాడు, కర్నూలు మండలం సుంకేసుల, ఆలూరు మండలం మొలగవెళ్లి, వెల్దుర్తి మండలం బొమ్మిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీల్లో ఉప సర్పంచు ఎన్నికలను నిర్వహించనున్నట్లు తెలిపారు. 27న ఉదయం 11 గంటలకు ఆయా గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఎన్నికలను నిర్వహిస్తామన్నారు.

గుంటూరులో 27 నుంచి 29 వరకు వ్యవసాయ ప్రదర్శన

కర్నూలు(అగ్రికల్చర్)/ఎమ్మిగనూరు రూరల్: గుంటూరులో ఈ నెల 27 నుంచి 29 వరకు దక్షణాది రాష్ట్రాల కోసం ప్రాంతీయ వ్యవసాయ ప్రదర్శన, ఉత్సవం నిర్వహిస్తున్నట్లు కర్నూలు ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుజాతమ్మ, బనవాసి కేవీకే ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ రాఘవేంద్ర చౌదరి తెలిపారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. వ్యవసాయ పద్ధతులు, డ్రోన్ల వినియోగం, పండ్ల పంటల సాగుపై శాస్త్రవేత్తల చర్చా వేదిక ఉంటుందని చెప్పారు. ఈ ప్రదర్శనకు జిల్లా నుంచి రైతులు వెళ్లి అవగాహన పెంచుకోవచ్చని సూచించారు.

మధ్యవర్తిత్వంపై శిక్షణ



శిక్షణలో పాల్గొన్న న్యాయవాదులు

కర్నూలు(సెంట్రల్): సుప్రీంకోర్టు నూతనంగా ప్రవేశపెట్టిన మధ్యవర్తిత్వంపై బార్ అసోసియేషన్ సభ్యులకు శిక్షణ ఇచ్చారు. బుధవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కబర్థి ఆదేశాలతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి, కేరళ నుంచి వచ్చిన రిసోర్స్‌పర్సన్‌లు సురేష్, జ్యోతిగోపీనాథన్ న్యాయవాదులకు అవగాహన కల్పించా రు. మధ్యవర్తిత్వంతో కేసులను ఎలా పరిష్కరించాలనే అంశాలు, ఉన్న చట్టాలపై శిక్షణ ఇచ్చారు.

యోగా అవార్డులకు నామినేషన్ల ఆహ్వానం

కర్నూలు(హాస్పిటల్): పీఎం యోగా అవార్డులు ఇచ్చేందుకు ఆన్‌లైన్ ద్వారా నామినేషన్లు, ప్రతిపాదనలు ఆహ్వానిస్తున్నట్లు సెట్కూరు సీఈఓ డాక్టర్ కె.వేణుగోపాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. యోగాలో జాతీయ, అంతర్జాతీ య స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన వారికి, యోగా అభివృద్ధికి కృషి చేసిన సంస్థలకు అవార్డులు ప్రదానం చేస్తారని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు ఈ నెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు https:// innovateindia. mygov. in/ pm& yoga& awards–2025 ను సందర్శించాలన్నారు.

మామూళ్ల కిక్కు!

దుకాణానికో రేటు ఖరారు

- కర్నూలులో రూ.70వేలు ఇవ్వాల్సిందేనని పట్టు
- మధ్యవర్తిత్వం చేసిన ఓ మంత్రి
- ప్రస్తుతానికి రూ.40వేలు చెల్లించేలా ఒప్పందం
- వ్యాపారాన్ని బట్టి కూడా వసూళ్లు
- ప్రతినెలా 10లోపు లావాదేవీల పూర్తి



కర్నూలు: ఉమ్మడి జిల్లాలోని మద్యం దుకాణాల్లో పోలీసుల మామూళ్ల దందా శృతి మించుతోంది. వ్యాపారం సాగుతుందా? లేదా అనే విషయంతో సంబంధం లేకుండా అన్ని చోట్లా వసూళ్ల పర్వం యథేచ్ఛగా సాగుతోంది. నెలకు దుకాణానికి రూ.40 వేలు, మరికొన్ని చోట్ల రూ.50 వేలు చొప్పున కప్పం కట్టాల్సిందేనంటూ అనధికారిక ఆదేశాలు జారీ చేస్తున్నారు. వచ్చిన మొత్తాన్ని వాటాలేసి పంచుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో 225 మద్యం దుకాణాలు, 60 బార్లు ఉన్నాయి. వీటిలో 90 శాతం దుకాణాల్లో పోలీసులు మామూళ్లు వసూలు చేస్తున్నారు. నెలకు రూ.40 వేల చొప్పున ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. కర్నూలు అర్బన్‌లో 21, రూరల్‌లో 11 మద్యం దుకాణాలు ఉన్నాయి. ఒక్కొక్క దుకాణానికి రూ.70 వేల చొప్పున ఇవ్వాలని ఓ పోలీసు అధికారి హుకుం జారీ చేయగా మద్యం సిండికేట్‌దారులు ఓ మంత్రిని ఆశ్రయించారు. వ్యాపారంలో ఎదురవుతున్న కష్టాల గురించి చెప్పుకున్నారు. దీంతో మంత్రి మధ్యవర్తిత్వం చేసి ఒక్కొక్క దుకాణానికి రూ.40 వేలు ఇచ్చేలా డీల్ కుదిర్చినట్లు వ్యాపారుల్లో చర్చ జరుగుతోంది. ఒక్క కర్నూలు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఉన్న 32 మద్యం దుకాణాలు, 18 బార్ల నిర్వాహకులు కలిసి నెలకు రూ.20 లక్షల దాకా పోగేస్తున్నారంటే వసూళ్ల పర్వం ఏస్థాయిలో సాగుతుందో అర్థమవుతోంది.

వ్యాపారం బాగా సాగితే అదనపు వసూళ్లు

కోడుమూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 15 మద్యం దుకాణాలు ఉన్నాయి. జిల్లాలోనే అత్యధిక వ్యాపారం జరిగే నాగలాపురం మద్యం దుకాణం నుంచి నెలకు రూ.లక్ష చొప్పున ఇవ్వాల్సిందేనంటూ ఓ అధికారి హుకుం జారీ చేసినట్లు వ్యాపార వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇలా ఉమ్మడి కర్నూలు జిల్లాలో వందకు పైగా దుకాణాల్లో అత్యధిక వ్యాపారం జరుగుతుండటంతో వాటి నిర్వాహకుల నుంచి పోలీసులు అదనంగా వసూలు చేస్తున్నట్లు సమాచారం. సిండికేట్ నిర్వాహకుల లెక్కల్లో ఏయే స్టేషన్‌కు ఎంత మొత్తం మామూళ్లు ఇస్తున్నారో పొందుపరచిన వివరాలపై ఇటీవల ఎక్సైజ్ అధికారులు, మద్యం వ్యాపారుల మధ్య చర్చ జరిగినట్లు తెలిసింది.

ప్రతినెలా 10వ తేదీలోపే!

కర్నూలు, నంద్యాల జిల్లాల్లో వసూళ్ల దందా జోరుగా సాగుతోంది. ప్రతినెలా 10వ తేదీ లోపే వసూళ్ల ప్రక్రియ పూర్తి చేస్తున్నారు. రెండు జిల్లాల్లో నెలకు రూ.కోటికి పైగా మామూళ్ల రూపంలో పోలీసులకు అందుతున్నట్లు వ్యాపార వర్గాల్లో చర్చ జరుగుతోంది. వచ్చిన మొత్తాన్ని రెండు వాటాలు వేసి ఎస్‌హెచ్‌లు, ఆపై అధికారులు పంచుకుంటున్నట్లు చర్చ జరుగుతోంది. స్టేషన్, సబ్ డివిజన్ పరిధిలో ఉండే మద్యం దుకాణాల సంఖ్యను బట్టి మామూళ్లు ముట్టజెపుతున్నట్లు తెలుస్తోంది.

అధిక ధరలకు అమ్మకాలు

- పోలీసులను మామూళ్ల మత్తులో పెట్టి నిర్వాహకులు నిబంధనలు గాలికి వదిలేస్తున్నారు.
- అధిక ధరలకు అమ్ముకునేందుకు రూరల్ ప్రాంతాల్లో బెల్టు షాపులకు మద్యాన్ని సరఫరా చేస్తున్నారు.
- ఈ క్రమంలో అర్బన్ ప్రాంతాల్లో దుకాణానికి నెలకు రూ.40 నుంచి రూ.50 వేలు, రూరల్ ప్రాంతాల్లో రూ.60 వేల నుంచి రూ.80 వేల దాకా మామూళ్ల రూపంలో పోలీసులు పోగేస్తున్నట్లు చర్చ జరుగుతోంది.
- ప్రతి మద్యం దుకాణం నుంచి వాటి అనుబంధ బెల్టు షాపులకు క్వార్టర్‌పై ఉన్న ఎమ్మార్పీ కంటే రూ.20 నుంచి రూ.50 వరకు ఎక్కువ ధరకు వ్యాపారులు సరఫరా చేస్తున్నారు.
- బెల్టు దుకాణాల్లో జరిగే దందాను చూసీచూడనట్లు ఉండేందుకు వ్యాపారాన్ని బట్టి ప్రత్యేక ప్యాకేజీలు ఏర్పాటు చేసుకుని వసూలు చేస్తున్నట్లు సమాచారం.

నేడు నేర సమీక్షా సమావేశం

కర్నూలు: జిల్లా పోలీస్ కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో గురువారం నేర సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. గత నెలలో జరిగిన నేరాలతో పాటు పెండింగ్ కేసులపై ఎస్పీ విక్రాంత్ పాటిల్ సమీక్షించనున్నారు. ముందుగా ఉదయం 6 నుంచి 9 గంటల వరకు కర్నూలు శివారులోని జగన్నాథగట్టుపై ఉన్న పోలీసు శిక్షణ కేంద్రంలో పోలీసు అధికారులకు ఫైరింగ్‌పై శిక్షణ, 10 గంటల నుంచి వ్యాస్ ఆడిటోరియంలో నేర సమీక్ష సమావేశం నిర్వహించేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు జిల్లాలోని పోలీసు అధికారులకు ఆదేశాలు అందాయి.

క్వింటా పత్తి రూ.7,666

ఆదోని అర్బన్: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి ధర క్రమంగా పెరుగుతోంది. బుధవారం క్వింటా ధర రూ.7,666గా నమోదైంది. రైతులు 517 క్వింటాళ్లు అమ్మకానికి తీసుకురాగా.. గరిష్ట ధర రూ.7,666, మధ్య ధర రూ.7,380, కనిష్ట ధర రూ.5,389 పలికింది.

- వేరుశనగలు 5,100 సంచులు విక్రయానికి రాగా.. గరిష్ట ధర రూ.6,827, మధ్య ధర రూ. 6,469, కనిష్ట ధర రూ.3,399 నమోదైంది.
- ఆముదాలు 32 సంచులు రాగా గరిష్ట ధర రూ.5,970, మధ్య ధర రూ.5,970, కనిష్ట ధర రూ.5,077 పలికింది.
- ఎండుమిర్చి 2,057 సంచులు రాగా గరిష్ట ధర రూ.10,206, మధ్య ధర రూ. 8,300, కనిష్ట ధర రూ.2,009 నమోదైంది.

అటవీ సంరక్షణకు చర్యలు



పెద్దకంబలూరు సమీపంలో వంతెన వద్ద గేటు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

రుద్రవరం: అటవీ సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెలిమ రేంజ్ పెద్దకంబలూరు సెక్షన్ అధికారి కిషోర్ తెలిపారు. బుధవారం ఆయన ఎఫ్‌బీఓ రామారావుతో కలిసి పెద్దకంబలూరు వంతెన వద్ద గేటు ఏర్పాటు చేశారు. ఈ విషయంపై వారు మాట్లాడుతూ తెలుగుగంగ ప్రధాన కాల్వ నిర్మించే సమయంలో అటు వైపు గ్రామాల ప్రజల అవసరాల నిమిత్తం పెద్దకంబలూరు వద్ద వంతెన ఏర్పాటు చేశారు. దీంతో ఆ గ్రామంతో పాటు అప్పనపల్లె, పందిర్లపల్లె తదితర గ్రామాల ప్రజలు ఆ వంతెన మీదుగా లోపలికి వెళ్లి పశువులను మేపుకొని తిరిగొచ్చేవారు. అయితే, కొందరు దుండగులు ఆ దారిన అడవిలోనికి వెళ్లి నేరానికి పాల్పడుతున్నట్లు తమ దృష్టికి రావడంతో ఉన్నతాధికారుల అనుమతులు తీసుకోని అడవిలోకి రాక పోకలు నిషేధిస్తూ గేటు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.త్వరలో తెలుగుగంగ ప్రధాన కాల్వ కట్టపై ఓ బేస్ క్యాంప్ కూడా ఏర్పాటు చేసేందుకు ఉన్నతాధికారుల అనుమతులిచ్చారన్నారు. బేస్ క్యాంప్ ఏర్పాటు అయితే నల్లమల అటవీ సంరక్షణకు మరింత మంది సిబ్బంది అందుబాటులో ఉంటారని ఆయన తెలిపారు.

క్లుప్తంగా

సెల్ ఫోన్ హ్యాక్ చేసి.. రూ. 90 వేలు కాజేసి!

వెల్దుర్తి: సైబర్ నేరగాళ్లు రోజుకో పంథాలో దోచుకుంటున్నారు. సెల్‌ఫోన్‌ను హ్యాక్ చేసి, ఓటీపీలు తెలుసుకుని బ్యాంక్ ఖాతాలో ఉన్న నగదును అపహరించారు. వెల్దుర్తి పట్టణానికి చెందిన రేమడూరు రామిరెడ్డికి స్థానిక యూనియన్ బ్యాంకులో ఖాతా ఉంది. సైబర్ నేరగాళ్లు అతని సెల్ ఫోన్‌ను ఈనెల 17న హ్యాక్ చేసి ఓటీపీలు తెలుసుకుంటూ బ్యాంకు ఖాతాలోని రూ.99 వేలను అమేజాన్ పే ద్వారా బదిలీ చేసుకున్నారు. తన ఖాతా నుంచి నగదు మాయమైనట్లు గుర్తించిన బాధితుడు బుధవారం బ్యాంకుకు వెళ్లి ఆరా తీశారు. సైబర్ నేరగాళ్ల పనేనని తెలుసుకుని తన ఖాతాను లాక్ చేయించారు. బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ఒద్దెల వాగులో యువకుడి గల్లంతు

- గాయాలతో బయటపడిన మరొకరు

పాణ్యం: మండల కేంద్రమైన పాణ్యం-కొణిదేడు గ్రామాల మధ్య ఉన్న వొద్దెలవాగులో ఓ యువకుడు గల్లంతు కాగా మరో యువకుడు గాయాలతో బయటపడ్డాడు. కొణిదేడు సమీపంలో రైల్వే డబ్లింగ్ పనులు జరుగుతున్నాయి. ఇక్కడ పనులు చేస్తున్న ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన రాహుల్, మరో యువకుడు పని మీద బుధవారం సాయంత్రం బైక్‌పై పాణ్యం వచ్చారు. రాత్రి పని ముగించుకుని పని చేసే చోటుకు తిరిగి వెళ్తుండగా ప్రమాదవశాత్తు ఒద్దెలవాగులో పడిపోయారు. గమనించిన వాహనదారులు రాహుల్ అనే వ్యక్తికి బయటకు తీశారు. మరో యువకుడు గల్లంతైనట్లు తెలిపారు. సమాచారం తెలుసుకు న్న 108 సిబ్బంది గాయపడిన రాహుల్‌ను నంద్యాల జీజీహెచ్‌కు తరలించారు. స్థానికులు వాగు వెంట మరో యువకుడికి కోసం గాలిస్తున్నారు.

ట్రాక్టర్ డ్రైవర్ దుర్మరణం

డోన్ టౌన్: పట్టణంలో వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ దుర్మరణం చెందాడు. మల్లెంపల్లె గ్రామానికి చెందిన సలీంద్ర వీరాంజనేయులు (30) డోన్ పట్టణం నుంచి కొత్తపల్లె వైపు ట్రాక్టర్‌లో వెళ్తుండగా వెనుక వస్తున్న మరో ట్రాక్టరు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వీరాంజనేయులు ట్రాక్టర్ నుంచి ఎగిరి పక్కనే ఉన్న డివైడర్‌పై పడటంతో తలకు తీవ్రగాయమైంది. ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతునికి భార్య మంజుల, నెలల వయస్సు కుమారుడు ఉన్నారు.

సంజీవయ్య జయంతి ఉత్సవాలకు రూ.3 లక్షలు

- ఫిబ్రవరి 14న ఘనంగా నిర్వహించిన జిల్లా అధికార యంత్రాంగం
- నేటికీ నయాపైసా విదల్చని ప్రభుత్వం

పెద్దాయనా.. మన్నించు !



దివంగత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య

కర్నూలు(అర్బన్): దివంగత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి నిర్వహణకు సంబంధించిన వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వం నేటికీ విడుదల చేయకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సంజీవయ్య సొంత జిల్లా అయిన కర్నూలులో ఆయన జయంతిని అంగరంగ వైభవంగా అధికారికంగా రాష్ట్ర స్థాయి పండుగ నిర్వహించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలోనే స్టేట్ హెడ్ క్వార్టర్స్‌తో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు ఒక్కో జిల్లాకు రూ.లక్ష, సంజీవయ్య సొంత జిల్లా కర్నూలుకు రూ.3 లక్షల నిధులు కేటాయిస్తున్నట్లు ఈ ఏడాది ఫిబ్రవరి 10న రాష్ట్ర ప్రభుత్వం జీఓ 2 విడుదల చేసింది. దీంతో జిల్లా అధికార యంత్రాంగం స్థానిక నంద్యాల చెక్‌పోస్టు సమీపంలో దామోదరం సంజీవయ్య విగ్రహం ఉన్న ప్రాంతంలో జయంతి వేడుకలను ఫిబ్రవరి 14న ఘనంగా నిర్వహించారు. నేడో రేపో నిధులు విడుదలైన వెంటనే చెల్లించవచ్చనే ధైర్యంతో సాంఘిక సంక్షేమ శాఖకు చెందిన పలువురు అధికారులు సప్లయర్స్ షాపు, పూల దుకాణాలు, కిరాణ తదితర షాపుల్లో అప్పులు చేసి జయంతిని ఘనంగా చేశారు. జయంతి నిర్వహించి నెల రోజులు గడచిపోయినా, ప్రభుత్వం నుంచి నేటికీ నయాపైసా విడుదల కాకపోవడంతో అప్పులు ఇచ్చిన షాపుల వారికి ముఖాలు చూపించలేక, అపద్దాలు చెప్పలేక పలువురు అధికారులు ముఖం చాటేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ఆయా షాపుల యజమానులు సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తుండటం గమనార్హం.

రౌడీషీటర్ల కదలికలపై నిఘా

బొమ్మలసత్రం: పాతనేరస్తులు, రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంచాలని, నేరాలు జరిగే ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పోలీసులను ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా ఆదేశించారు. బుధవారం స్థానిక తాలూకా పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. పెండింగ్ ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రోడ్డుప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా గ్రామాలకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకోనేలా చూస్తామన్నారు. విధులు పట్ల అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఎస్పీ వెంట డీఎస్పీ మందాజావళి ఆల్ఫోన్స్, సీఐ ఈశ్వరయ్య ఉన్నారు.

ఐడియా అదుర్స్



ఎండలకు అడుగు బయట పెట్టాలంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. విధి నిర్వహణలో ఎండలో బైక్‌పై ప్రయాణించాలంటే జాగ్రత్తలు తీసుకోవాల్సిందే. ఈ క్రమంలో ఓ కానిస్టేబుల్ ఎండ నుంచి రక్షణ పొందేందుకు వినూత్నంగా ఆలోచించారు. తన బైక్‌పై ప్రత్యేకంగా గొడుగు తరహాలో ఏర్పాటు చేసుకుని రయ్ మంటూ వెళ్తూ అందరినీ ఆకర్షిస్తున్నారు. కోసిగి పోలీస్‌స్టేషన్లో విధులు నిర్వహించే గోనెగండ్ల జీటీ. నాగన్న ప్రస్తుతం ఎమ్మిగనూరు పట్టణంలో షీ-టీమ్‌లో విధులు నిర్వహిస్తున్నారు. విధి నిర్వహణలో ఫీల్డ్ విజిట్ ఎక్కువగా ఉండటంతో ఎండ నుంచి రక్షణ పొందేందుకు తన బైక్‌పై ఓ వెదర్ షీట్‌ను, ముందర గ్లాస్ తరహాలో ఫ్రేమ్‌ను అమర్చుకున్నారు. దీంతో ఎండతో పాటు వడగాలులు తగలకుండా వెళ్తున్నారు. ఈ సందర్భంగా కానిస్టేబుల్ మాట్లాడుతూ.. వెదర్ షీట్‌తో హెల్మెట్ పెట్టుకోవడంతో ఎండల్లో ప్రయాణానికి అనుకూలంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ వాడాలని సూచించారు.

– ఎమ్మిగనూరు రూరల్

రైతు ఇంట మెరిసిన ఆణిముత్యాలు

- ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన ముగ్గురు కుమారులు
- చిన్నారులకు ఉచితంగా బోధన చేస్తున్న రైతు



ముగ్గురు కుమారులతో తల్లిదండ్రులు వెంకటేశ్వర గౌడు, వెంకటేశ్వరమ్మ

బేతంచెర్ల: ఆ రైతుకు చదువు అంటే ఎంతో ఇష్టం. ఆర్థిక ఇబ్బందులతో ఉన్నత చదువుకు దూరమయ్యాడు. అయితే వ్యవసాయం చేస్తూనే తన కలను కుమారులతో సాకారం చేసుకున్నాడు. ముగ్గురు కొడుకులను బాగా చదివించడంతో వారు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. తన బిడ్డల్లానే గ్రామంలో చిన్నారులు కూడా శ్రద్ధగా చదువుకుని ప్రయోజకులు కావాలని ఆకాంక్షిస్తూ సాయంత్రం వేళ ఉచితంగా విద్యను బోధిస్తున్నాడు. ఎంబాయి గ్రామం పాడి పంటలకు ప్రసిద్ధి. ఆ గ్రామంలో ఈడిగ వెంకటేశ్వర్లు, వెంకటేశ్వరమ్మ దంపతులది సాధారణ వ్యవసాయ కుటుంబం. వీరికి ముగ్గురు కుమారులు ఉన్నారు. తల్లిదండ్రుల కష్టాన్ని దగ్గరగా చూసిన ముగ్గురు కుమారులు పట్టుదలతో చదివి ఉద్యోగాలు సాధించారు. పెద్ద కుమారుడు తులసీ రామ్ గౌడ్ డిగ్రీలో బీజెడ్‌సీ పూర్తి చేసి 2014లో ఎయిర్ ఫోర్స్‌లో మెడికల్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యారు. ప్రస్తుతం బెంగళూరులో పని చేస్తున్నారు. రెండవ కుమారుడు బెనర్జీ గౌడ్ వెటర్నరీలో డిప్లొమో పూర్తి చేసి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అనిమల్ హస్బెండరీగా ఎంపికయ్యారు. కొలుములపల్లె సచివాలయంలో పని చేస్తూ.. ఇటీవల వెటర్నరీ అసిస్టెంట్‌గా పదోన్నతి పొంది ముద్దవరంలో విధులు నిర్వహిస్తున్నారు. చిన్న కుమారుడు తరుణ్‌కుమార్ గౌడ్ 2019లో అనంతపురం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించారు. ఇటీవల కళాశాలలో జరిగిన గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ మాణిక్యరావు చేతుల మీదుగా డాక్టర్ పట్టా అందుకున్నారు. వ్యవసాయ కుటుంబం నుంచి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ప్రభుత్వ కొలువులు సాధించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పట్టుదలతో సాధించారు



గ్రామంలో చిన్నారులకు బోధన చేస్తున్న వెంకటేశ్వర గౌడు

నేను 10వ తరగతి వరకు చదువుకున్నాను. ఆర్థిక పరిస్థితుల కారణంగా ఉన్నత చదువులకు వెళ్లలేక గ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ పిల్లలను బాగా చదివించాలనుకున్నా. వారు కూడా పట్టుదలతో చదివి ప్రయోజకులయ్యారు. చిన్నప్పటి నుంచి పిల్లలు పాఠశాలకు వెళ్లి వచ్చిన తరువాత బోధన అంశాలపై చర్చించి, సందేహాలను నివృత్తి చేసేవాడిని. మా పెద్ద కుమారుడు తులసీరామ్ గౌడ్ ఎయిర్ ఫోర్స్‌లో ఉద్యోగం సాధించిన తరువాత తమ అన్నను ఇద్దరు తమ్ముళ్లు ఆదర్శంగా తీసుకుని ఉద్యోగాలు సాధించారు. నా కొడుకుల మాదిరిగానే గ్రామంలోని చిన్నారులు కూడా బాగా చదువుకోవాలని నా వంతుగా సాయంత్రం వేళలో ఉచితంగా బోధన చేస్తున్నాను.

– వెంకటేశ్వర్లు గౌడు, ఎంబాయి

ప్రయాణికుల భద్రతకు పకడ్బందీ చర్యలు చేపట్టండి

ఆదోని సెంట్రల్: ప్రయాణికుల భద్రతకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని రైల్వే సౌత్ సెంట్రల్ జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ రైల్వే అధికారులకు సూచించారు. వార్షిక తనిఖీలో భాగంగా ఆయన బుధవారం సులహళ్లి నుంచి గుంతకల్లు వరకు రైల్వే స్టేషన్లను పరిశీలిస్తూ ఆదోని రైల్వే స్టేషన్‌ను తనిఖీ చేశారు. అమృత్ భారత్ పథకం కింద స్టేషన్‌లో జరుగుతున్న పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటించాలని సూచించారు. ఈయన వెంట ప్రిన్సిపల్ చీఫ్ అప్రెంటీస్ మేనేజర్ పద్మజ, గుంతకల్లు డీఆర్ఎం చంద్ర శేఖర్ గుప్త ఆదోని స్టేషన్ మాస్టర్ వెంకటేశ్వర్లు, చీఫ్ క్యాంప్ సూపరింటెండెంట్ త్రిభువన్, రైల్వే పోలీసులు తదితరులు ఉన్నారు.

నిబంధనలు నీట ముంచి.. ప్రజల రక్షణ మరిచి !



కేపాసిటీకి మించి ప్రయాణికులతో వెళ్తున్న ఇంజిన్ బోటు

పగిడ్యాల: శ్రీశైలం బ్యాక్‌వాటర్‌లో ఇంజిన్ బోటులో ప్రయాణికుల తరలింపును అడ్డుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశించినా అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు. మూర్వకొండ ఘాట్, అర్లపాడు ఘాట్ నిర్వాహకులకు అధికార పార్టీ నేతల అండదండలతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. కృష్ణానదికి ఇరువైపులా బంధువర్గాలు ఉన్న ప్రజలు ఆయా ప్రాంతాలకు రోడ్డు మార్గంలో వెళ్లాలంటే వ్యవప్రయసాలు కావడంతో చాలా మంది ఇంజిన్ బోట్లను ఆశ్రయిస్తున్నారు. దీంతో ఘాట్ నిర్వాహకులు కెపాసిటీకి మించి ప్రయాణికులను పడవలో తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కనీసం లైఫ్ జాకెట్లు లేకుండా ప్రయాణికులను పంపుతున్నారు. మూడు నెలలుగా కొనసాగుతున్న అనధికారిక ఇంజిన్ బోటు ప్రయాణంపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఘాట్ నిర్వాహకులు నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. ఇంజిన్ బోట్లలో కెపాసిటీకి మించి 25 నుంచి 30 మంది ప్రయాణికులను తరలించడమే కాకుండా బైక్‌లను అందులో తరలించి ఒక్కొక్కరి నుంచి రూ. 200ల ప్రకారం వసూలు చేస్తున్నారు. 2007 జనవరి 18న ఇదే మూర్వకొండ ఘాట్ నుంచి సింగోటం జాతరకు నాటు పడవలో వెళ్తూ 60 మంది జల సమాధి అయిన ఘటన నేటికి కళ్ల ముందు కనిపిస్తూనే ఉంది. అయినా కాలం చెల్లిన ఫిట్‌నెస్ లేని ఇంజిన్ బోట్లపై ప్రయాణికులు భయం భయంగా కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ అనుమతి (లైసెన్స్) లేకపోయినప్పటికీ అధికార పార్టీ ఎమ్మెల్యే వర్గీయుల కనుసన్నల్లో అనధికార ప్రయాణానికి పచ్చ జెండా ఊపడంతో ఘాట్ నిర్వాహకులకు కాసుల పంట పండుతోంది. ఈ విషయమై తహసీల్దార్ శివరాముడును వివరణ కోర గా.. ఇంజిన్ బోటు ప్రయాణానికి ఎలాంటి అను మతి ఇవ్వలేదని విచారించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

నన్నూరు టోల్‌గేట్‌లో ఎస్‌ఐ హల్‌చల్

- మా వాహనాన్నే ఆపుతావా అంటూ బూతులు
- దురుసు డ్రైవింగ్‌తో దెబ్బతిన్న బూమ్ బ్యారియర్
- ఓ ఉద్యోగిని వాహనంలో స్టేషన్‌కు తరలింపు

సాక్షి టాస్క్‌ఫోర్స్: ఓర్వకల్లు మండలం నన్నూరు టోల్‌గేట్ వద్ద ఓ ఎస్‌ఐ హల్‌చల్ చేశారు. మా వాహనాన్నే ఆపుతావా అని అక్కడి సిబ్బందిని భయభ్రాంతులకు గురిచేశారు. ఒక్కసారిగా వాహనాన్ని ముందుకు కదిలించడంతో టోల్‌బూత్‌లో ఏర్పాటు చేసిన బూమ్ బ్యారియర్ దెబ్బతినింది. ఈ ఘటన బుధవారం ఉదయం 11.30 గంటల ప్రాంతంలో చోటు చేసుకుంది. సదరు ఎస్‌ఐ కర్నూలు ఉపకారాగారం నుంచి ఓ ముద్దాయిని స్టేషన్‌కు తీసుకొచ్చారు. స్వయంగా ఆయనే కారు నడుపుతున్నారు. వాహనం నన్నూరు టోల్‌గేట్‌కు చేరుకోగా ముందున్న మరో వాహనం ఫాస్‌టాగ్ స్కాన్ కాకపోవడంతో సిబ్బంది మాన్యువల్‌గా టోల్ రుసుము వసూలు చేశారు. ఆ వెంటనే బూమ్ బ్యారియర్ యథాస్థితికి వస్తుండగా ఎస్‌ఐ నడుపుతున్న వాహనం ఒక్కసారిగా ముందుకు కదిలింది. ఆ సమయంలో బూమ్ బ్యారియర్ దెబ్బతినింది. ఇంతలో టోల్ సిబ్బంది వాహనం చుట్టూ గుమికూడటంతో ఎస్‌ఐ బూతు పురాణం మొదలుపెట్టారు. తమ వాహనాన్నే ఆపుతారా అంటూ గద్దించారు. అంతటితో ఆగకుండా టోల్ కలెక్టర్ మహబూబ్‌బాషాను బలవంతంగా అదే వాహనంలో ఎక్కించుకొని స్టేషన్‌కు తీసుకెళ్లారు. టోల్ సిబ్బంది బతిమాలినా ఫలితం లేకపోయింది. ఉద్యోగిని తీసుకెళ్లి స్టేషన్‌లో ఉంచారు. అయితే విషయం ఆనోటా ఈనోటా బయటకు పొక్కడంతో సాయంత్రం 5 గంటల ప్రాంతంలో టోల్ ఉద్యోగిని విడిచిపెట్టడం గమనార్హం. ఇదిలాఉంటే గతంలోనూ ఈ ఎస్‌ఐ టోల్‌గేట్ సిబ్బంది పట్ల దురుసుగా వ్యవహరించినట్లు సమాచారం. ఆ సమయంలో ఆయన మఫ్టీలో కారు నడుపుతుండగా సిబ్బంది ఐడీ కార్డు అడిగినట్లు తెలిసింది. నన్నే కార్డు అడుగుతావా అని సిబ్బందిపై విరుచుకుపడినట్లు సమాచారం.

అందరూ చూస్తుండగానే ఆత్మహత్య

- గుత్తి రైల్వే స్టేషన్‌లో రైలు కింద పడి మృతి
- మృతుని స్వగ్రామం గొర్విమానుపల్లె
- ఆర్థిక సమస్యలే కారణమని సమాచారం



మహేంద్ర (ఫైల్)

కొలిమిగుండ్ల: అనంతపురం జిల్లా గుత్తి రైల్వే స్టేషన్ బుధవారం మధ్యాహ్నం ప్రయాణికులతో రద్దీగా ఉంది.. అందరూ చూస్తుండగానే ఓ యువకుడు పట్టాలపైకి చేరుకొని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ హఠాత్తు సంఘటనతో అక్కడి ప్రయాణికులు షాక్‌కు గురయ్యారు. కొలిమిగుండ్ల మండలం గొర్విమానుపల్లెకు చెందిన రామదాసు శ్రీరాములు, మునెమ్మ దంపతులకు కుమార్తె, కుమారుడు సంతానం కాగా కూతురుకు వివాహమైంది. కుమారుడు మహేంద్ర (25) గతంలో గ్రామంలో వలంటీర్‌గా పని చేశాడు. ప్రస్తుతం అనంతపురం జిల్లా యాడికి సమీపంలోని ఓ సిమెంట్ పరిశ్రమలో పని చేస్తున్నాడు. కొద్ది రోజుల నుంచి ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాడు. ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కే మార్గం లేక ఐదు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పలు చోట్ల గాలిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం గుత్తి రైల్వే స్టేషన్‌కు చేరుకున్న యువకుడు రైలు వేగంగా వస్తుండగా ప్రయాణికులు చూస్తుండగానే ప్లాట్‌ఫామ్ పైనుంచి దూకి పట్టాలపై తల పెట్టి పడుకోవడంతో రైలు అతనిపై వెళ్లిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి వివరాలు ఆరా తీయగా గొర్విమానుపల్లెకు చెందిన మహేంద్రగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఆర్థిక సమస్యలతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

లారీ ఢీకొని యువకుడి దుర్మరణం

పెద్దకడబూరు: హనుమాపురం బస్టాండ్ సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఎస్‌ఐ నిరంజన్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన శాంసోన్ అలియాస్ రంగన్న, ముక్కీరమ్మ కుమారుడు మారెప్ప(22) బనవాసి నుంచి బైక్‌పై ఎమ్మిగనూరు వైపు వెళ్తున్నాడు. అదే సమయంలో ఎమ్మిగనూరు నుంచి ఆదోని వైపు వస్తున్న లారీ బైక్‌ను ఢీకొంది. ఈ సంఘటనలో మారెప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో బైక్‌కు నిప్పు అంటుకొని మంటలు వ్యాపించడంతో గ్రామస్తులు నీళ్ల పోసి అదుపు చేశారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని తల్లి ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

దైవ దర్శనానికి వెళ్తూ..



సందీప్‌కుమార్ బాబు(ఫైల్)

జూపాడుబంగ్లా/కొత్తపల్లి: సప్తనదుల సంగమేశ్వరంలో వెలిసిన సంగమేశ్వరుడి దర్శనానికి వెళ్లిన ఓ యువకుడు కృష్ణానదిలో మునిగి మృత్యువాత పడ్డాడు. మండ్లెం గ్రామానికి చెందిన పోతులరాజు మద్దిలేటి, బాలావతమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్దవాడైన సందీప్‌కుమార్‌బాబు తిరుపతిలోని ఐఎఫ్ ఎఫ్‌టీ కంపెనీలో మార్కెటింగ్ ఉద్యోగం చేస్తున్నాడు. తండ్రికి ఆరోగ్యం బాగోలేదని చూసేందుకు నాలుగు రోజుల క్రితం స్వగ్రామానికి చేరుకున్నాడు. కాగా బుధవారం తన మిత్రుడు తంగడంచ గ్రామానికి చెందిన శివకుమార్‌తో కలిసి బైక్‌పై సప్తనదుల సంగమేశ్వరాలయానికి వెళ్లారు. నదిలో స్నానం చేసిన అనంతరం ఆలయ అర్చకుడు తగ్గిన కృష్ణా జలాల్లో నడుచుకొంటూ ఆలయం వద్దకు వెళ్లి పూజలు చేసి రావటాన్ని గమ నించారు. వారు కూడా ఆలయం వద్దకు వెళ్లి స్వామిని దర్శించుకునేందుకు కృష్ణాజలాల్లో నడుచుకొంటూ వెళ్లసాగారు. కొద్దిదూరం వెళ్లాక శివకుమార్ తన వద్ద ఉన్న సెల్‌ఫోన్ ఒడ్డుపై పెట్టివస్తానని బయటకు వచ్చాడు. సందీప్ కుమార్‌బాబు ఒక్కడే నీళ్లల్లో నడుచుకుంటూ ఆలయం వద్దకు వెళ్లాడు. ఆలయం సమీపిస్తుండగానే అక్కడ లోతైన గుంతలోని పూడికలో కూరుకపోయి మునిగిపోయాడు. శివకుమార్ గమనించి కేకలు వేయటంతో సమీపంలోని మత్స్యకారులు పుట్టిల్లో వెళ్లి నీట మునిగిన సందీప్‌కుమార్‌బాబును ఒడ్డుకు చేర్చారు. కాగా అప్పటికే అతను మృతిచెందాడు. సమాచారం అందుకన్న యువకుడి తల్లిదండ్రులు సంగమేశ్వరానికి చేరుకుని విలపించారు. సమాచారం అందుకున్న కొత్తపల్లి ఎస్‌ఐ ఎం.కేశవ సిబ్బందితో కలసి సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదానికి కారణాలు తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి బాబాయి బుజ్జన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని ఎస్‌ఐ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

సంజామల: మండల పరిధిలోని మంగపల్లె గ్రామంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని ఎస్‌ఐ రమణయ్య బుధవారం అరెస్ట్ చేశారు. గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులు రైల్వే ట్రాక్ సమీపంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం రావడంతో సిబ్బందితో కలసి దాడి చేసి పట్టుకున్నారు. నిందితుల నుంచి రూ.3150 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.



భక్తజనం మధ్య సుయతీంద్రుల స్వర్ణ రథయాత్ర

నయన మనోహరం



శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు, మత్తూరు మఠం పీఠాధిపతి బోధానంద సరస్వతి తీర్థులు

మంత్రాలయం: నవ మంత్రాలయం శిల్పి, రాఘవేంద్రస్వామి మఠం పూర్వపు పీఠాధిపతి సుయతీంద్రతీర్థుల మధ్యారాధన వేడుకలు నయన మనోహరంగా సాగాయి. బుధవారం శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల నేతృత్వంలో మధ్యారాధన వేడుకలు అంగరంగా వైభవంగా చేపట్టారు. సుయతీంద్రతీర్థుల మూల బృందావనానికి శాస్త్రోక్తంగా విశేష పంచామృతాభిషేకం నిర్వహించి.. ఆధ్యాత్మిక పరిమళాలు విరబూసేలా మధ్యారాధన పూజోత్సవాలు చేశారు.. అనంతరం స్వర్ణ రథంపై సుయతీంద్రుల చిత్రపటాన్ని కొలువుచేయగా స్వామిజీ సుబుధేంద్రతీర్థులు హారతులు పట్టి రథయాత్రకు శ్రీకారం చుట్టారు. శ్రీమఠం ప్రాంగణ వీధుల్లో అశేష భక్తజన వాహిని మధ్య రథయాత్ర రమణీయంగా సాగింది. మత్తూరు మఠం పీఠాధిపతి బోధానంద సరస్వతీ శ్రీమఠాన్ని సందర్శించారు. ముందుగా రాఘవేంద్రుల దర్శనం చేసుకుని సుయతీంద్రతీర్థుల ఆరాధనోత్సవాల్లో పాల్గొన్నారు.